# అక్షరాంజలి

అనామకుడు
(ఎ ఎస్ రామశాస్త్రి)

# అక్షరాంజలి

అనామకుడు

(ఎ ఎస్ రామశాస్త్రి)

అపరాజిత పబ్లికేషన్స్

**Aksharaanjali**

By Anaamakudu
(A S Ramasastri)

First Published:
August 11, 2020

© Author

**Cover Photo:**
Aparajitha Allamraju

**Published by**
Aparajitha Publications
Flat 401, Block 3
MyHome Vihanga
Gachibowli
Hyderabad - 500032
INDIA

For Free Circulation
asramasastri.com/books/aksharanjali.pdf

**ISBN:** 922/ISBN/2020/A

# అంకితం

నా వెన్నంటే ఉంటూ
నన్ను అనుక్షణం నడిపిస్తున్న
అదృశ్య శక్తికి

ౖమొక్కెద సృష్టి కర్తకును మోడ్చెద చేతులు లోక భర్తకున్
చెక్కుచు విశ్వ శిల్పమును చిన్నెలు వన్నెలు చేర్చు స్రష్టకున్
చక్కని నాటకంబునకు శంపలు సొంపులు కూర్చు ద్రష్టకున్
మక్కువ తోడ నెల్లరకు మంగళమిచ్చెదు ప్రేమమూర్తికిన్

# అనుక్రమణిక


అక్షరాంజలి ..... 5

ఆత్మనివేదన ..... 7

నీ వినోదం ..... 10

మా సందేహం ..... 16

నీ విలాసం ..... 19

ఉపనిషత్తులు ..... 25

సనాతన విజ్ఞానం ..... 28

నా విన్నపం ..... 40

అనుబంధం ..... 48



# అక్షరాంజలి

అరవై సంవత్సరాలుగా ఈ సృష్టి నన్ను
అనుక్షణం అబ్బురపరుస్తూనే ఉంది.
ఆనందంలో ముంచెత్తుతూనే ఉంది.

విశ్వవైశాల్యాన్నీ వైచిత్రినీ
విజ్ఞానం ఆవిష్కరిస్తోంటే
విభ్రాంతుణ్ణి అవుతూనే ఉన్నాను.

యాజ్ఞవల్క్యుడు, శంకరుడు, ఆర్యభటుడు,
ఆర్కిమెడిస్, న్యూటన్, డార్విన్, మెండెల్, ఐన్‌స్టీన్
అందరూ నన్ను మంత్రముగ్ధుణ్ణి చేస్తూనే ఉన్నారు.

కాంతి సంవత్సరాల దూరాలకి విస్తరిస్తున్న విశాల విశ్వం
కంటికి కనపడనంత చిన్నదైన వింతల క్వాంటం
కనికట్టులా నన్ను కవ్విస్తూనే ఉన్నాయి.

అవనిపై రసాయన మిశ్రమంగా మొదలై
అమీబాగా అవతరించిన ఏకకణజీవి నరుడిగా
ఆవిర్భవించే పరిణామక్రమం వింతగా తోస్తూనే ఉంది.

మనిషిని జీవులన్నిటి నుండి వేరు చేస్తున్న జన్యువులు
మనిషిలో భిన్నవిభిన్న రూపాలను సృజించడం
మరింత వింతగా అనిపిస్తోంది.

అనేక బిలియన్ల న్యూరాన్ల చిన్ని మెదడు తన్ని తానే
అర్థం చేసుకుని అందరికీ అర్థం అయ్యేలా చెప్పడం
అద్భుతంగా అనిపిస్తూనే ఉంది.

నిక్షిప్త విశ్వరహస్యం, సృష్టివిలాసం
నిరంతరం నాలో కలిగించే ఆలోచనల్ని ఆ సృష్టికర్తకే
నివేదించాలన్న కోరిక ఎన్నాళ్లుగానో నాలో నిక్షిప్తమై ఉంది.

సృష్టికర్త ప్రేరణతోనే
సృష్టిలో నేను చూస్తున్న విశేషాలనీ వింతలనీ
సృష్టికర్తకు విన్నవించుకునే ప్రయత్నం మొదలుపెట్టాను.

ఆ ప్రయత్న ఫలితమే
అరవై పద్యాల అక్షరాంజలి

అనామకుడు
(ఏ ఎస్ రామశాస్త్రి)
జూన్ 19, 2020

# ఆత్మనివేదన

తాతలు పండితోత్తములు; తండ్రి ప్రవీణులు పెక్కు భాషలన్;
మాతయు ఆంధ్రభాగవత మంజుల పద్యము నేర్చినమ్మ; సం
జాతుగ వారి వంశమున సంస్కృతమాంధ్రము కొంత నేర్వగా -
ఊతములైరి పద్యరచనోద్యమమందున నాకు వారలే

పోతన పద్యగంధముల పూత లభించెను చిన్ననాటనే
భౌతికశాస్త్రసూత్రముల వాసనలంటెను పాతికేళ్ళకే
రీతిగ విత్తనీతుల గరిష్ఠత అబ్బెను వృత్తి పాలనన్
ధాతకు నిత్యశిష్యునిగ తత్త్వము నేర్చెద జీవితాంతమున్

అందము చిందు నీ సృజన అద్భుతమందితి సంబరంబుతో
అందిన సృష్టి సూత్రముల అల్లిక నేర్చితి సంభ్రమంబుతో
అందరియందు నీ దయకు ఆర్ద్రతనందితి సంతసంబుతో
అందగనిత్తు పద్యముల ఆత్మనివేదన సాదరంబుగా

కారణమేమి వ్రాయుటకు - కాదు ధనార్జన కాదు కీర్తియున్
కారకుడైన నీ పయిని గౌరవమంతయు విన్నవించుటే
భారము మోయు నిన్ను మృదు వాక్కుల హాయిగ పల్కరించుటే
ఆరని నాదు గుండెతడి అర్పణ చేయుటె అక్షరంబుగా

ఇచ్చితివీవు భోజ్యములు - ఇచ్చితి నీకు నివేదనంబుగా
ఇచ్చితివీవు పుష్పములు - ఇచ్చితి నీకు సుమాలమాలగా
ఇచ్చితివీవు విద్యలను - ఇచ్చుచునుంటిని పద్యమట్లుగా
ఇచ్చిన నీకె ఇచ్చుటను - ఎంచక తప్పుగ స్వీకరించుమా

# నీ వినోదం

తారల మండలంబులును తారలు కృష్ణబిలంబులెన్నో - సం
చారము చేయుచున్న సువిశాల ప్రపంచపు మూలనెక్కడో
సౌరకుటుంబమందు పరిసర్ప గ్రహంబులలో - గృహంబుగాన్
ధారుణి మాకు యోగ్యమని దత్తము చేసితివీవు - ప్రేమతో

తూరుపు వెల్గురేకలను, తోయపుధారల, ప్రాణవాయువున్,
క్షీరమునిచ్చు గోవులను, సేద్యము చేయగ సారభూములన్,
పారు నదీనదంబులను, పర్వతశ్రేణుల, సాగరంబులన్
కోరగ ఊహకందనివి కూర్చితివన్నియు నీదు కాన్కగా

ఉన్నవి శ్వాస తీయుటకు ఊపిరితిత్తులు, అన్నకోశమున్,
సన్నని రక్తనాళముల సన్నసనంబుగ నింపు గుండెయున్
సన్నహనంబుగా నిలిచి స్వల్పవిరామము లేక సర్వదా
దన్నుగనుండు యంత్రముల దానమునిచ్చుట నీ కటాక్షమే

యోచన చేయు శక్తి; వినియోగ నిమిత్తమునుండు యుక్తి; కా
ర్యాచరణానురక్తి; పెను యత్నమునుండి లభించు భుక్తి; ఆ
లోచనలందు కోరికల లుప్తము చేయు విరక్తి; నాదు సం
కోచములన్ని వీడి నిను కొల్చెదు భక్తి - త్వదీయ భిక్షలే

ఉన్నది నాసికొక్కటియె; ఓష్ఠకపోలములైన దోయులే;
కన్నులు కన్బొమల్ ద్వయమె; కర్ణములైనను రెండె; వీనిలో
చిన్నగ కొన్నిమార్పులను చేయుచు భిన్న విభిన్న రూపుతో
ఎన్నియొ కోట్ల మోములను ఎల్లపుడెట్లు సృజించుచుందువో?

చక్రము - విత్తువృక్షముల చర్వితచర్వణ భేదజాలముల్
చక్రము - భూమి సూర్యపరిసర్పము చేసెడు మార్గమంతయున్
చక్రము - కాలమంతయును సాలుదినంబులు వారమాసముల్
చక్రము నీదు కల్పనయె సాగుచునుండెడి ఆగకుండగన్

ఇక్కడనుండు పుష్పమున కెక్కడి నుండియొ తెచ్చు పుప్పొడుల్
మక్కువ తోడ తుమ్మెదలు - మక్కువ తుమ్మెదలందు కల్గగన్
చక్కని రంగు వాసనలు చక్కెర తేనెలు ఉండు పువ్వులో -
ఒక్కరి పైన ఒక్కరికి ఉంచితివెంతటి ప్రేమబంధమున్

పంచెదవీవు ప్రేమమును - భార్యయు భర్తయు దగ్గరౌనటుల్
పెంచెదవీవు గర్భమున - పిండము వెంటగనుండి పిల్లగా
ఉంచెదవీవు స్తన్యమును - ఓగిరమయ్యెడు చంటికూనకున్
ముంచెదవీవు లోకమును - ముద్దుల పాపల బోసినవ్వులన్

ఆటను సృష్టి చేసి నియమావళి సర్వము నిర్ణయించి - మ
మ్మాటల నాడనిచ్చెదవు - అంతియె కాక జయించనిచ్చి - ఆ
బూటకమైన గెల్పునకు పొంగెడు మాపయి జాలితోడ - ఏ
నాటికొ మాకు తెల్పెదవు - నాటకమంతయు నీదు కేళిగాన్

ధాత్రియె రంగభూమిగ ప్రదర్శితమయ్యెడు నాటకంబులో
పాత్రలమైన మాకు సహపాత్రల మాటలు వేషభాషలే
మాత్రము ముందు తెల్పకనె మమ్ములనెల్ల నటింపచేసెడున్
సూత్రము నీదు హస్తముల శోభిలుచున్నది దర్శకాగ్రణీ!

ఉప్పెనలెన్ని వచ్చినను, ఉల్కలనేకము భూమి రాలినన్,
నిప్పుల గాడ్పు వీచినను, నేలహఠాత్తుగ చీలిపోయినన్,
చెప్పక క్రూరజంతువులు చిన్నని చీడలు దాడిచేసినన్
ముప్పుల నుండి తప్పుకొని ముందుకు సాగెడు నేర్పు - నీ కృపే

# మా సందేహం

అంతము ఆదిలేని పరమాత్మ వినోద విలాస లీలగా
అంతకుముందు లేని జగమంతయు తాను సృజించుచున్నదో?
అంత ఘనీభవించిన పదార్థము సర్వము ఒక్కసారిగా
వింతగ పేలిపోయి పెనువిశ్వముగా ప్రసరించుచున్నదో?

అన్నిటి నేతి నేతనుచు ఆవలనుంచుచు సాగిపోవగా
ఉన్నది బ్రహ్మమొక్కటియె - ఉర్విని సర్వము దాని మాయయా?
కన్నది మాత్రమే నిజము కాంచు పదార్థమె సత్యమెప్పుడున్
చిన్న కణంబులన్నిటి విచిత్ర విలాసపు సృష్టి విశ్వమా?

జీవితమంత చీకటుల చీకుల చింతల చిక్కు మమ్ములన్
కావగ నీవు కావలెను కావున నిన్ను సృజించుకుంటిమో?
నీవెగ సృష్టిచేయునది నిత్య వినూత్న విశాల విశ్వమున్
స్థావర జంగమంబుల విధాతగ మమ్ము సృజించుచుందువో?

తారల మధ్య దూరము, పదార్థపు రీతులు, దేహభాగముల్
తీరుల చూచి సత్యమును తేల్చగనెంచెడు ఊహ సవ్యమా?
మారుచునుండు లోకమొక మాయయె - సత్యము - అంతరంగపున్
దారుల యోగసాధనము ధ్యానము చేసిన కాని చిక్కదా?

యోచన చేయు నా మెదడు యుక్తమయుక్తము చెప్పుచుండగన్
తోచినయట్లు నా పనులు తుష్టిగ చేసెడు స్వేచ్ఛ నాదియా?
ఏ చరమైన కాని భవదిచ్ఛను కాదని చేయదేమియున్
కాచెడువాడవీవు భువి కార్యములన్నియు నీదు ఇచ్ఛయా?

# నీ విలాసం

ఇంత విశాల విశ్వమున కెల్లలు లేకయె సృష్టిచేయుచున్
వింతలనెన్నొ దాచెదవు - విశ్వరహస్యము నీదు లీలయే -
ఇంతటిదైన జ్ఞానమును ఎప్పటికెంతగ తెల్పనెంతువో -
అంతియె విప్పి చెప్పుటకు - ఆనతినిత్తువు శాస్త్రవేత్తకున్

ఇప్పుడు చక్కగా తళుకులీనుచు కన్పడు చుక్కలెన్నియో -
ఎప్పుడు అక్కడుండినవొ? ఇప్పుడు ఎక్కడ ఉన్నవో కదా?
అప్పుడు చుక్కవీడిన శతాధిక వేగపు కాంతిరేఖలే
ఇప్పుడు మమ్ము చేరినవి - ఎంత విచిత్రమొ నీదుకల్పనల్!

అన్నిట చిన్నదైన పరమాణువునందు కణంబులెన్నియో -
అన్నిటినెట్లు నింపితివి? అందు ఋణాత్మకమైన కొన్నిటిన్
భిన్న విభిన్న కక్ష్యలలో పేర్చితివెట్టుల? ఎట్లు విశ్వవి
చ్ఛిన్నము చేయు శక్తులను చేర్చితివింతటి చిన్నదానిలో?

కంటికి కానరానిదగు 'క్వాంటము' నందున వింతలెన్నియో
క్వాంట కణంబు లొక్కపరి కన్పడునంట తరంగమట్లుగా
జంటగ కొల్వజాలమట స్థానము వేగము ఒక్కసారిగా
తుంటరివందునా నిను? అతుల్యపు విశ్వము సృష్టి చేసెడున్

ఆకసమందు గోళముల, అబ్ధుల, బండల, ప్రాణికోటులన్
లోకమునందు అన్నిటికి లోపలి మూల కణంబులొక్కటే
ఆకణ సంచితంబులగు ఆకృతులన్నియు నీదు కూర్పులే
నీ కళనేమనంగలను? నీదు చరాచరసృష్టి చూచుచున్

ఒక్క కణంబు రెండుగ - మరొక్క దినంబున రెండు నాల్గుగా -
పెక్కు కణంబులౌట పెనువింత - కణంబుల కొన్ని నోరుగా,
ముక్కుగ, కళ్ళుగా, చెవులు, మోముగనౌట - మరెంత వింతయో
చెక్కితివిన్ని వింతలను చిన్నని జీవ కణంబునందునన్

ఆనవు కంటిచూపులకు - అంతటి చిన్నకణంబులన్నిటన్
పేనితివెట్లు జీవులను భిన్నవిభిన్నుల చేయు జన్యువుల్ -
వాననె ఉంచినావెటుల - వ్యాధుల, బాధల, విద్యలన్నియున్,
మానవ రూపరేఖలను, మంచిని పెంచు గుణంబులన్నిటిన్

జీవియె లేని కాలమున చిన్న రసాయన మిశ్రమంబుగా
జీవము అంకురించెను మహీతలమందు - తదాదినెట్టులో
జీవులు పుట్టసాగినవి - చెట్టులు, మొక్కలు, మత్స్యకూర్మముల్,
గువ్వలు, కీటకంబులును, గోవులు, వానర, మానవాదులున్

ఒక్కటి రెండు మూడనుచు ఒక్కటికొక్కటి పెంచుచున్నచో
ఎక్కడి దాక సంఖ్యలను ఎంచగ సాధ్యము? కోటికోటులా?
చక్కని ఊహలిచ్చితివి సంఖ్యల రూపున శూన్యమాదిగన్
లెక్కలకందరానిదగు క్లిష్టపు భావనయే అనంతమా?

అక్షులు కాంచు లోకమున కర్థము చెప్పుట దాని విద్యయే
అక్షము చేయుకార్యముల కాజ్ఞల నిచ్చుట దాని విజ్ఞతే
అక్షర కావ్యమాలికలు అంకెల గారడి దాని వేడుకే
అక్షయమైన మేధయును అండగ నుంచుట నీ విలాసమే

చేతులు కళ్ళు నావనుచు చింతన చేయునదేదొ వింతగా
నా తల నిండ నింపినది నాదను నేనను యోచనంబులన్
రేతిరి దాగునెచ్చటనొ - లేచిన నిల్పును నన్ను నన్నుగా
చేతన యంచు పిల్చెదము - చిత్రమదేమొ యెరుంగకున్ననున్

# ఉపనిషత్తులు

రెండు వేల సంవత్సరాల కన్న ముందుగానే
యాజ్ఞవల్క్యుని వంటి ఋషులు
విశ్వరహస్యం గురించి సాగించిన
వాదసంవాదాల సారం ఉపనిషత్తులు.

అప్పటికి వాళ్లకి తెలిసిన విశ్వానికి అతీతంగా -
వాళ్లకి తెలియకుండా ఉన్న సత్యాన్ని
నిర్వచించడానికీ, నిదర్శనలతో నిరూపించడానికీ
సాగించిన అన్వేషణ అక్షరరూపమే ఉపనిషత్తులు.

ఇన్ని వేల సంవత్సరాల తర్వాత
మనం విజ్ఞానపరంగా ఎంతో ముందుకు సాగిన తర్వాత కూడా
వాళ్ళు వేసుకున్న ప్రశ్నలూ సూచించిన సమాధానాలూ
మనల్ని ఆలోచింపచేస్తాయి.

ఉపనిషత్తులలో కొన్ని కథలు అవాస్తవంగా కనిపించవచ్చు.
కొన్ని విషయాలు మళ్ళీమళ్ళీ చెప్తున్నట్లు అనిపించవచ్చు.
ఐతే మనం ఉపనిషత్తులు చదువుతున్నప్పుడు -
అవి ఏ కాలంలో ఏ పరిస్థితుల్లో చెప్పబడ్డాయో ఆలోచించుకోవాలి.

అలా ఆలోచించుకుంటే
కొన్ని వేల సంవత్సరాల క్రితమే
ఇంద్రియాతీతమైన విషయాల గురించి
ఎలా ఊహించగలిగారో అని ఆశ్చర్యం కలుగుతుంది.

నేతి నేతి అని అనుకుంటూ
ఇంద్రియాలతో చూసిన వానిని నిరాకరిస్తూ
నిరాకారమైన సచ్చిదానంద స్వరూపాన్ని
దర్శించడానికి వాళ్ళు పడ్డ తపన అబ్బురపరుస్తుంది.

తాము దర్శించిన నిరాకార పరమాత్మ
ఉనికిని నిరూపించేందుకు -
ఎన్ని దృష్టాంతాలు, ఎన్ని ఉపమానాలు సృష్టించుకున్నారో
చదువుతోంటే మహాద్భుతంగా అనిపిస్తుంది.

అప్పటి వారి
జిజ్ఞాసకీ, పరిశీలనకీ, పరిశోధనకీ, తర్కానికీ, శాస్త్రీయతకీ
ముగ్ధులమై వాళ్ళని ద్రష్టలు అనే అనగలం.
ఉపనిషత్తులని వేదాంతమనే అనుకోగలం.

వేల సంవత్సరాలుగా మానవజాతి ఆవిష్కరించుకున్న
కొన్ని వైజ్ఞానికాంశాలను
'నీ విలాసం'గా పునరవలోకనం చేసుకున్నాక నాకు
వేదాంతవిజ్ఞానాన్ని స్పృశించాలని అనిపించింది.

ఉపనిషత్సాగరంలో నాకు దొరికిన కొన్ని రత్నాల
పద్యరూపాలే ఈ 'సనాతన విజ్ఞానం'
ఇందులోని పద్యాలు ఏ ఉపనిషత్తుకో,
ఉపనిషత్కథకో, భాగానికో అనువాదం కాదు.

ఉపనిషత్తులలోని మూల విషయాన్ని అర్థం చేసుకుని
పద్యాలుగా వ్రాయడానికి నేను చేసిన ప్రయత్నం.
అర్థం చేసుకోవడంలో పరిపూర్ణత లోపించినా
వ్రాయడంలో పరిపక్వత లేకున్నా -

అది పూర్తిగా నా లోపమే.

# సనాతన విజ్ఞానం

## పూర్ణం

పూర్ణంబిది పూర్ణంబది
పూర్ణంబుదయించుచుండు పూర్ణమునందున్
పూర్ణంబున తొలగించిన
పూర్ణంబును - మిగిలియుండు పూర్ణంబంతన్

# ఈశ

ఎల్ల కాలములందు ఎల్ల దేశములందు
ఎల్ల జీవులనుండు ఏకమదియె
అతి కాంతిమంతమై అతి వేగవంతమై
అపజయంబే లేని అజితమదియె
ఉండునన్నిటిలోన ఉండునావలకూడ
కదలకున్నను తోచు కదలునట్లు
అనుభవించునదదె అనుభవమ్మునదియె
భిన్నరూపములందు ఉన్నదదియె

తనకు తానుగ సృజియించుకొనెను తనను
తానె సృజియించుచున్నది ప్రాణికోటి
ఇజ్జగంబున సర్వంబు ఈశమయము
ఈశ భిన్నంబు లోకాన ఏది లేదు

# బ్రహ్మము

కన్నులకేనాడు కనిపించునది కాదు
కన్నులకిచ్చును కాంచు శక్తి
వీనులకేనాడు వినిపించునది కాదు
వీనులకిచ్చును వినెడు శక్తి
నాసికకేనాడు వాసన దొరుకదు
మూర్కొనుశక్తిని ముక్కునకిడు
పలుకులకేనాడు పట్టుబడదు కాని
మాటాడు శక్తిని నోటికిచ్చు

నిలువదేనాడు ఎవ్వరి తలపులందు
తలపులన్నియు కలుగును దానివలన
అదియె బ్రహ్మము బ్రహ్మమ్ము అదియె అదియె
కారు ఇంద్రాది దేవతలు కానె కారు

# ఓంకారం

వేదాలు వినిపించు వాదాలు వివరించు
విశదీకరించును విద్యలెల్ల
వర్తమానము కాదు వచ్చుకాలము కాదు
గతకాలమైనను కానె కాదు
జననాలు మరణాలు సవ్యాపసవ్యాలు
కార్యకారణములు కానరావు
విశ్వంబు సర్వంబు విధ్వంసమైనను
వినిపించుచుండును విడువకుండ

అదియె సకలార్థ సృష్టికి ఆది తుదియు
అదియె జగతికి ఆధారమనవరతము
అదియె ఓంకార నాదంబు - ఆదిలేదు
అదియె ఓంకార నాదంబు - అంతమవదు

# అహం బ్రహ్మాస్మి

ప్రథముందుగా నేను ప్రభవించినాడను
నాశనంబే లేదు నాకునెపుడు
అధిగమించితి నేను అన్నిలోకాలను
రవిబింబమట్లు నే ప్రజ్వలింతు
భోజనంబును నేను భుజియించునది నేను
అనుభవించెడు నేనె అనుభవంబు
గీతకర్తను నేను గీతమైనను నేను
గీతార్థసారమ్ము సైతమేను

తిరుగుచుంటిని అజ్ఞాన తిమిరమందు
జ్ఞాన దీపపు కాంతులు కానవచ్చె
ఆత్మ పరమాత్మ అద్వైతమర్థమయ్యె
నేనె బ్రహ్మంబు అన్నట్టి జ్ఞానమబ్బె

# నిరాకారం

ఆదిమధ్యలు కాని అంతమన్నది కాని
పైనకిందలు కాని లేనెలేవు
ఆకారములు కాని ఆహార్యములు కాని
ఎత్తుఒడ్డులు కాని ఏమిలేవు
బంధుమిత్రులు కాని బాంధవ్యములు కాని
స్వపరభేదాలు రవ్వంత లేవు
ఇంద్రియంబులు కాని ఇహపరంబులు కాని
పాపపుణ్యాలైన పట్టిలేవు

అపుడు ఇపుడు ఉండు; అచట ఇచట ఉండు;
స్థలము కాలములను నిలువబోదు;
లేవు పూర్వపరము; లేవు వాసనలేవి
లేదు నాశనంబు లేనెలేదు

# అద్వైతం

వీణ తంత్రులనుండి వినవచ్చు నాదాలు
వీణాస్వనమ్ములె వేరు కావు
పరమాత్మ సృజియించు ప్రాణులు సర్వులు
పరమాత్మ రూపాలె పరులు కారు
సుడులెత్తు నదులన్ని కడలిలో కలియగా
విడిగ నదులు లేవు కడలి తప్ప
జీవాత్మలెప్పుడు చేరునో పరమాత్మ
ఒక్కటౌ పరమాత్మ ఉండునపుడు

భార్య ప్రియమగునది భార్య కొరకు కాదు
అగును ప్రియము భార్య ఆత్మ కొరకు
ఏది దానికొరకు ఎట్లగును ప్రియము
అన్ని ప్రియములగుట ఆత్మకొరకె

# పరమపద సోపానం

ఓంకార మంత్రంబు ఉచ్చరించెడు వాడు
బ్రహ్మమార్గమునందు పయనమగును
ఋక్కులన్నిటి కూడ చక్కనేర్చినవాడు
విశ్వాసమును పొందు విశ్వమందు
యజుసులన్నిటి కూడ అభ్యసించినవాడు
అంతరిక్షపు మార్గమందు చనును
సామగానము కూడ సాగనిచ్చెడువాడు
పైలోకముల చేరి బ్రహ్మ కాంచు

ఇష్టపడినవి దొరకును ఋక్కు వలన
యజుసు సమకూర్చు ఆకాశయాన గరిమ
చేర్చు సామమ్ము బ్రహ్మమ్ము చెంత వరకు
ప్రణవ నాదంబె సోపాన పరమ పదము

# విశ్వరూపం

వేదవేదాంగాలు వాదాలు శాస్త్రాలు
జ్ఞానమంతయు పుట్టు దేని నుండి?
యాగాలు హోమాలు యజ్ఞాలు మంత్రాలు
దేవుళ్ళ స్తోత్రాలు దేని కొరకు?
గువ్వలు పువ్వులు గోవులు మత్స్యాలు
మానవులున్నది దేని వలన?
ధర్మాలు న్యాయాలు మర్మాలు చట్టాలు
దానాలు నిలిచేవి దేని చేత?

దేని శిరసు అగ్ని; దిక్కులు కర్ణాలు;
వాక్కు వేదరాశి; శ్వాస గాలి;
రవియు శశియు కనులు; భువి పాదపీఠమో
అదియె సృష్టి లోని ఆత్మ అగును

# యజ్ఞం

నరుడు చేయుచునుండు నిరతమ్ము యజ్ఞమ్ము
తనదు జీవితమంత త్యాగమిడుచు
బాల్యకౌమారాలు పాఠ్యాంశములకిచ్చు
విశ్వోపయుక్తమౌ విద్య కొరకు
యౌవనంబంతయు ఆర్జనంబునకిచ్చు
సతిసుతులహితుల హితము కొరకు
వార్ధక్యమంత సంభాషణంబులకిచ్చు
భావితరమువారి బాగు కొరకు

క్రతువు - ధర్మార్థకామమోక్షముల కొరకు
హవిసు - నరుడు చేసెడు జీవితార్పణమ్ము
క్రతువు - లోక కళ్యాణ మంగళము కొరకు
ఫలము - విశ్వమంతట నిండవలయు శాంతి

# యోగమార్గం

కట్టె యందున దాగి కానుపించని అగ్ని
ప్రజ్వలించునపుడు పైకి లేచు
అంతరంగమునందు అలరారు పరమాత్మ
తపము ధ్యానము చేత తారసిల్లు
క్షీరధారల లోన చేరియుండెడి వెన్న
చిలుకగా చిలుకగా వెలికివచ్చు
లోకులందరిలోన లోనుండు పరమాత్మ
నిరత సాధన వల్ల దొరకుచుండు

యోగసాధనంబు రోగాల తొలగించు;
దరికి చేరనీదు జరను మృతిని;
మదిని కలత పెట్టు మలినాల తొలగించు;
ముదము నిచ్చు; తుదిని మోక్ష మిచ్చు

# కోహం?

నీవెవ్వరో నేనెవ్వరో
ఈ విశ్వ రహస్యమంత ఎవ్వరికెరుకో
ఈ వింతకు మొదలేదియొ
ఈ విశ్వపు పయనమంత ఏ దిశగానో

# నా విన్నపం

తలపుల నీవనవరతము
'బలమి'చ్చుచు నిలిచియుండు భాగ్యము చాలున్
కలతలలో నిను కొలిచెడు
'బలహీనత' లేక నేను బ్రతుకగవలయున్

అజ్ఞాతంబుగ నుండెడు
విజ్ఞానంబును నిరతము వెదకుట కొరకై
అజ్ఞానము పోగొట్టెడు
'జిజ్ఞాస'ను నిలువనిమ్ము జీవితమెల్లన్

పడినప్పుడు ఒడిదుడుకుల
కడతేరని కలతలందు కష్టములందున్
విడకుండగ నిబ్బరమును
నడిపించెడి 'ఆశ' నింపు నా మది నిండన్

అనుకున్నది జరుగనపుడు
అనుకోనిది జరిగినపుడు - ఆరట పడకన్
మనకది ప్రాప్తంబనుకొన
మనసున సం'తృప్తి' నింపు మాకందరికిన్

అతిగా మోసము ద్వేషము
ప్రతిదినమును రగులు పగలు ప్రతికారంబుల్
సతమతమౌ మా బ్రతుకుల
సతతము నీవీయవలెను 'శాంతి'ప్రశాంతుల్

కనబడు అన్యాయంబును
చననిమ్మని విడువకుండ సరిపోరాడన్
తనువందున మనమందున
అనవరతము ’బలము’నిమ్ము అన్నిటియందున్

పనులన్నిట కలిగించెడి
అనునిత్యము పిరికితనము అవరోధంబుల్
దినదిన మరణము వలదిక
మనసున ’ధైర్యంబు’ నింపు మనిషిగ మనగన్

తలచినదే పలుకునటుల
పలికినదే చేయునటుల బ్రతుకుట కొరకై
సలిపెదను 'సత్య'వ్రతమును
నిలుపుము నను దుర్లభమగు నిజమార్గమునన్

పుస్తకములెన్నిచదివిన
మస్తిష్కము వీడి పోవు మాత్సర్యాదుల్
వ్యస్తము చేసెడు 'ఈర్ష్యా'
గ్రస్తుడు కాకుండ నన్ను కావగవలయున్

ఉర్విని నా ధర్మంబులు
నిర్వర్తించితిని నేను నీ దయచేతన్
సర్వము నే చేసితినను
'గర్వంబు'న మునుగకుండ కావగవలయున్

అహరహము నన్ను వీడక
సహజీవుల సన్నిహితుల జనులందరినిన్
బహురీతుల బాధించెడి
'అహము'ను తొలగించుకొనగ ఆనతి వలయున్

మతమైనను కులమైనను
జతగా దేశంబులైన సంఘంబైనన్
మితిమీరు 'దురభిమానము'
పతనమునకు మొదటి మెట్టు వలదది నాకున్

అన్నియు నేనే అనుకుని
సన్నని గిరిగీచుకుంటి 'స్వార్థము'తోడన్
ఎన్నియొ తప్పులు చేసితి
నన్నిక నిస్స్వార్థ దిశగ నడిపింపవలెన్

మనవారని పగవారని
పనులన్నిటనుండు 'పక్షపాతపు'బుద్ధుల్
జనులందరి హితము కనని
మన అను ఆ తలపు వలదు మనమున నాకున్

తన'కోపమె' తన శత్రువు
అను సూత్రము చదువుచున్న అనునిత్యంబున్
నను శత్రువు విడనాడదు
నెనరున గెల్చుటకు శక్తి నీవీయవలెన్

# అనుబంధం

## Notes for Selected Poems

### Page 20 – Poem 1

Light travels at a speed of around 300000 kms per second.

Distance travelled by light in one year is a light year. (Frederick Bessel)

Nearest star from earth is about four light years away. (Robert Innes)

There are stars that are millions of light years away from earth.

The universe is expanding after the Big Bang. (Edwin Hubble)

The stars are moving away at high speeds.

By the time light reaches earth from a star, the star would have moved far away.

The location where we see a star now, was where the star was long time ago.

## Page 20 – Poem 2

పరమాణువు = Atom

కణము = Sub-atomic Particle

ఋణాత్మక = Negatively Charged

కక్ష్య = Orbit

Atom is the smallest constituent unit of ordinary matter. (Democritus)

There are positively, negatively and neutrally charged particles in an atom.

Protons are positively charged and neutrons are neutrally charged.

Electrons are the negatively charged particles. (J J Thomson)

Protons and neutrons are in the nucleus of the atom. (Rutherford)

Electrons rotate round the nucleus in orbits. (Niels Bohr)

Energy can be converted to mass and mass to energy.

The equivalent equation is $E = mc^2$. (Albert Einstein)

The amount of energy possessed by an object is equal to its mass multiplied by the square of the speed of light.

As the speed of light is very high, energy possessed by small particles is also very high.

Atom bombs release very high energies capable of destroying cities. (Robert Oppenheimer)

## Page 21 – Poem 1

క్వాంటం = Quantum

కణము = Particle

తరంగము = Wave

స్థానము = Position

వేగము = Velocity

Quantum is the smallest possible discrete unit of any physical property such as energy or matter. (Max Plank).

Quantum theory describes the behaviour of matter and energy at atomic and sub-atomic levels.

Some of our notions from the world around us are not valid at quantum level.

Wave-Particle theory states that everything in the universe behaves both as particle and wave. ( Louis de Broglie)

Uncertainty principle postulates that if one knows the precise momentum of a particle it is impossible to know the precise position. (Heisenberg)

## Page 21 - Poem 2

An element is a substance that is made entirely from one type of atom.

While there are around 118 known elements, 94 of them are found naturally on earth. (Mendeleev)

A molecule is a group of two or more atoms, chemically bonded together

Atoms of the same element or of different elements join together to form molecules.

Matter is made up of elements.

The human body is mostly made up of six elements viz., oxygen, carbon, hydrogen, nitrogen, calcium and phosphurus

A normal human body has around 7 billion billion billion atoms in it.

## Page 22 – Poem 1

కణము = Cell

A zygote, also known as a fertilized ovum, is the union of the sperm cell and the egg cell.

The zygote begins as a single cell but divides rapidly in the days following fertilization.

After two-week period of cell division, the zygote becomes the embryo.

As the embryo grows for about eight weeks, it is called the fetus.

The fetus keeps growing by continuous cell division, forming different body organs.

Cells forming the brain grow at the rate of 100000 neurons per minute in the sixth week.

The growth rate increases to 250000 neurons per minute by tenth week.

Woman's womb is the stage for the growth of fertilized ovum

into a baby.

Woman's body has several systems and sub-systems to take care of the growth during all stages.

The embryo creates its own supporting mechanism by splitting into two halves in the fourth week.

One half becomes the placenta, which delivers nutrients and oxygen throughout the pregnancy.

## Page 22 – Poem 2

జన్యువు = Gene

All living things are made of cells.

Cells are tiny bags of living matter that come in different shapes and sizes.

A gene is the basic physical and functional unit of heredity. (Mendel).

Genes are made up of deoxyribonucleic acid, the DNA.

Chromosomes are structures within cells that contain genes (Theodor Boveri).

A chromosome contains hundreds to thousands of genes.

A human being has 23 pairs of chromosomes, 23 inherited from each partner. (Joe Hin Tjio).

All the 46 chromosomes are present at the stage of zygote itself.

The chromosomes and genes determine traits such as eye color,

hair color, skin, and body type and, to some extent, personality and intelligence.

## Page 23 – Poem 1

More than 3.5 billion years ago, under some very favourable conditions of light, heat, etc., a few chemical reactions in water spontaneously would have formed a protein compound (Alexander Oparin, J. B. S. Haldane).

The chemical compound would have undergone more complex changes to create a single-celled organism called prokaryote.

From prokoaryote, other more complex organism would have originated.

Thereafter, evolution would have happened by a process of natural selection. (Charles Darwin).

From fish, would have evolved amphibians, birds and mammals.

## Page 23 –Poem 2

సంఖ్య = Number

శూన్యము = Zero

అనంతము = Infinity

1,2,3 are natural numbers used for counting.

Zero is a very special number added to the number system. (Brahmagupta)

Decimal system made arithmetic simpler

As the ability to count larger numbers enhanced, the need for the

symbol of infinity arose. (John Wallis)

Infinity is not a number, it is an idea of something without an end.

## Page 24 – Poem 1

Brain is the most vital organ of human beings.

It receives information from sensory organs like eyes.

It analyses, organises, stores, processes and retrieves the information.

It commands organs like hands for necessary appropriate action.

It is the seat of intelligence.

## Page 24 – Poem 2

చేతన = Consciousness


Consciousness at its simplest is awareness of internal or external existence.

It is the most familiar and most mysterious aspect of our lives.

Despite centuries of analyses, definitions, explanations and debates by philosophers and scientists, consciousness remains puzzling and controversial.

The only widely agreed notion about it is the intuition that it exists.

Opinions differ about what exactly is to be studied and explained as consciousness.



## అనామకుడు

(ఏ ఎస్ రామశాస్త్రి)

మద్రాస్ ఐఐటీ నుండి పీ. హెచ్‌డి
Oxford, Kellog విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్య
రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా లో మూడున్నర దశాబ్దాలు ఉద్యోగం
ప్రస్తుతం హైదరాబాద్ లో IDRBT డైరెక్టర్

ఆర్థిక శాస్త్రం లో ఆంగ్ల పుస్తకాలు
'Valuation of Financial Assets'
'Quantitative Methods for Banking and Finance'
అందులో మొదటి పుస్తకం చైనీస్ లో కూడా ప్రచురితం

అనామకుడు కలం పేరుతో తెలుగులో
కథలు, నవలికలు, శ్రవ్య నాటికలు
'రమణీయం', 'శీలమా అదియేమి' కథాసంకలనాలు
'ఉషశ్రీ ఇంతింతై వటుడింతయై' జీవిత కథ

web: www.asramasastri.com
email: ramasastri@hotmail.com
Telegram @ Ramasastri